భారత న్యాయ వ్యవస్థ

ప్రజాస్వామ్య వ్యవస్థ అనే ముక్కాలి పీటకు.. శాసన శాఖ, కార్య నిర్వాహక వర్గం, న్యాయశాఖలు మూడు కాళ్లు. వీటిలో ఏది బలహీనపడినా.. ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది. శాసన శాఖ రూపొందించే చట్టాలు, కార్యనిర్వాహక వర్గం చేపట్టే చర్యలు పౌరస్వేచ్ఛకు భంగం కలిగిస్తే... రాజ్యాంగ నిబంధనలకు వైరుధ్యంగా ఉంటే... అవి చెల్లవని తీర్పు ఇచ్చే అధికారం సుప్రీంకోర్టు, హైకోర్టులకు ఉంది. దీనినే 'న్యాయసమీక్ష అధికారం' అంటారు!!

గోలక్‌నాథ్ కేసు (1967) విచారణ జరిపేంత వరకు సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కుల సవరణతో సహా పార్లమెంటు చేసిన చట్టాలన్నింటికీ దాదాపు మద్దతునిచ్చింది. ఆస్తి హక్కును సవరించే అధికారం 368వ ప్రకరణ కింద పార్లమెంటుకు లేదని మెజారిటీ న్యాయమూర్తులు పై కేసులో అభిప్రాయపడ్డారు. అప్పటినుంచి పార్లమెంటుకు, కార్య నిర్వాహక శాఖకు, న్యాయవ్యవస్థకు ఘర్షణ ప్రారంభమైందని చెప్పవచ్చు. ఇది పరోక్షంగా న్యాయవ్యవస్థ క్రియాశీలతకు దోహదం చేసింది. కేశవానంద భారతి కేసులో(1973)... ధర్మాసనం ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు, పార్లమెంటు అధికారాలపై పరిమితులు విధిస్తూ... పరోక్షంగా న్యాయవ్యవస్థ పరిధిని విస్తృతం చేసింది. ఈ తీర్పులో వెలువరించిన రాజ్యాంగ మౌలిక స్వభావ సిద్ధాంతాన్ని తదుపరి కేసులలో ప్రస్తావిస్తూ ... సుప్రీంకోర్టు ప్రభుత్వంలోని మిగిలిన రెండు శాఖల మీద తన ఆధిపత్యాన్ని నిలబెట్టడానికి ప్రయత్నిస్తుందని విమర్శకుల అభిప్రాయం.

ఎమర్జెన్సీ సమయంలో న్యాయవ్యవస్థ కొన్ని పరిమితులకు లోనై వ్యవహరించినప్పటికీ... 1978 తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని, క్రియాశీల ధోరణిని అవలంబిస్తుందని భారత రాజ్యాంగ నిపుణుల అంటున్నారు. జస్టిస్ పి.ఎన్. భగవతి, వి.ఆర్. కృష్ణయ్యర్ తదితరుల చొరవతో ప్రజాహిత వ్యాజ్యం (PIL) ఆవిర్భవించి భారతీయ పౌరులెవరైనా న్యాయార్థులు కావచ్చు అన్న స్ఫూర్తికి నిలువుటద్దం పట్టింది. తొలి రోజుల్లో ప్రజాహిత వ్యాజ్యం ఎంతో ప్రయోజనదాయకమైంది. ఎంతకీ కొలిక్కిరాని విచారణలో మగ్గిపోతున్న వేలమంది బీహారీ ఖైదీలకు విముక్తిని ప్రసాదించింది.. ఈ ప్రజాహిత వ్యాజ్యమే.

హవాలా డొంకను కదిపి, సతీష్ శర్మ పెట్రోలు బంకుల కేటాయింపుల దుర్వినియోగాన్ని బట్టబయలు చేసిందీ ఈ వ్యాజ్యమే. గంగానది కాలుష్య నివారణ, వాహన కాలుష్యం వల్ల ఢిల్లీ వాసుల జీవించే హక్కుకు భంగం కలిగిందంటూ.. ఒక పౌరుడు సుప్రీంకోర్టును ఆశ్రయించినపుడు డీజిల్ బస్సులను CNG బస్సులుగా మార్పించిన ఘనత సుప్రీంకోర్టుదే. అడవుల్లో చెట్లను విచక్షణా రహితంగా నరికివేయడాన్ని అడ్డుకుంది న్యాయవ్యవస్థే. కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలంటూ ఆదేశించడం.. ఢిల్లీ నగరంలో అక్రమ నిర్మాణాలను తొలగించడం.. బొమ్మై కేసులో 356వ ప్రకరణ దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొన్ని సూచనలివ్వడం న్యాయవ్యవస్థ క్రియాశీలతకు దర్పణం.

ఇవన్నీ ప్రభుత్వం నుంచి వ్యతిరేకతను, ప్రతిఘటనను ఎదుర్కొన్నవే. ఒకవైపు శాసనశాఖ, రెండో వైపు కార్యనిర్వాహక వర్గం క్రమేణా ప్రజా విశ్వాసాన్ని కోల్పోతుంటే... రాజ్యాంగ పరిరక్ష, పౌరస్వేచ్ఛ వ్యవస్థగా న్యాయశాఖ చొరవ తీసుకోవడం సహజమే. న్యాయ వ్యవస్థ క్రియాశీలత వల్ల ప్రాథమిక హక్కుల పరిధి విస్తృతమైంది. నివాస హక్కు, ఆరోగ్య హక్కు, జీవనోపాధి హక్కు, విద్యాహక్కు, స్వచ్ఛమైన పర్యావరణం, న్యాయ సహాయ హక్కు జీవించే హక్కులో భాగమని సుప్రీం కోర్టు నిర్వచించింది.

అలాగే స్వాతంత్ర్య హక్కులో విదేశాలకు వెళ్లే హక్కు, ఏకాంతపు హక్కు భాగమని.. పత్రికా స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ హక్కులో భాగమని... సమాన వేతనం పొందే హక్కు, సమానత్వపు హక్కులో భాగమని తీర్పునిస్తూ... ప్రాథమిక హక్కులకు నూతన భాష్యాన్నిచ్చింది. రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలు కొంతమేరకు ప్రాథమిక హక్కుల హోదాను సంతరించుకోవడం కూడా (39వ ప్రకరణలోని (బి), (సి)లలో ప్రస్తావించిన ఆదేశ సూత్రాలకు 14, 19 ప్రకరణల్లో పేర్కొన్న ప్రాథమిక హక్కుల కంటే ఎక్కువ ప్రాధాన్యత) న్యాయవ్యవస్థ క్రియాశీలత వల్లే జరిగింది.అయితే, క్రియాశీలతనే నెపంతో న్యాయ వ్యవస్థ లక్ష్మణరేఖను దాటుతుందనే విమర్శ ఉంది. దీనికి చాలావరకు కారణం శాసనశాఖ, కార్యనిర్వాహక వర్గాల దుర్బలత. మండల్ వివాదం, రామ జన్మభూమి వివాదంలో కార్యనిర్వాహక వర్గం కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవడానికి భయపడి.. వాటికి పరిష్కార మార్గాన్ని సూచించమని న్యాయవ్యవస్థను కోరడం.. హవాలా కేసులో సీబీఐ నిష్పక్ష పాతంగా వ్యవహరించడం లేదని న్యాయవ్యవస్థను జోక్యం చేసుకోవలసిందిగా ప్రతిపక్ష నాయకులు కోరడం.. తమిళనాడు ప్రభుత్వం, కర్ణాటక ప్రభుత్వాన్ని కావేరి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీచేయమని సుప్రీంకోర్టును కోరడం... ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాల ముసుగులో వ్యక్తులు, సంస్థలు, సుప్రీంకోర్టును మిగిలిన రెండు శాఖల కార్యకలాపాల్లో జోక్యం చేసుకోమని కోరడం... మొదలైనని న్యాయవ్యవస్థ క్రియాశీలతకు పురికొల్పాయి. ఈ నేపథ్యంలో.. కొన్ని సందర్భాల్లో న్యాయవ్యవస్థ అతిగా స్పందించిన సంఘటనలు కూడా ఉన్నాయి.

కావేరి నదీజలాల సమస్యను చర్చించడానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించడం న్యాయ వ్యవస్థ క్రియాశీలతలో ఒక కొత్త కోణం. రోజురోజుకు శాసన

శాఖ కార్యనిర్వాహక శాఖల పనిలో పెరుగుతున్న న్యాయ వ్యవస్థ జోక్యాన్ని దృష్టిలో పెట్టుకొని... విమర్శకులు ''న్యాయ వ్యవస్థతో నడుస్తున్న ప్రభుత్వం'' అని వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల కాలంలో ''సభ్యులు డబ్బు తీసుకొని పార్లమెంటులో ప్రశ్నలు వేయడం'' కేసులో సుప్రీంకోర్టు స్పందించిన తీరు.. తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చిన బిల్లులు న్యాయ సమీక్ష పరిధిలోకి వస్తాయని తీర్పునివ్వడం... లాంటి సంఘటనలు శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థల మధ్య ఘర్షణకు దారితీసేవిగా ఉన్నాయి.

జార్ఖండ్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తినప్పుడు గవర్నరు తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ... సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై... లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ చటర్జీ ''శాసనసభ అంతర్గత కార్యకలాపాలలో న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకొన జాలదు'' అని అభిప్రాయపడ్డారు. రోడ్లు, వంతెనలు నిర్మించాలని ప్రభుత్వానికి ఆదేశాలివ్వడం.. రైళ్ల రాకపోకలకు సరైన వేళల పట్టిక రూపొందించాలనడం.. విద్యాసంస్థలలో అడ్మిషన్లు ఎలా జరపాలో నిర్దేశించడం.. లాంటి ఉత్తర్వులు న్యాయవ్యవస్థ మితిమీరిన జోక్యాన్ని నిర్ధారిస్తాయి.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఏ.కె.మాథుర్, మార్కండేయ కట్జూ.. ఇటీవల కాలంలో ప్రతిపాదించిన ''న్యాయవ్యవస్థ సహేతుకత'' (Judicial reasonableness) హద్దులు దాటుతున్న క్రియాశీలతను పరిమితం చేయడమే ననవచ్చు. కోర్టు ధిక్కారణ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాయనే విమర్శ కూడా విన్పిస్తోంది. తరచుగా ఈ అధికారాన్ని వినియోగించడం ఆరోగ్యకరమైన సంకేతం కాదు.. అని న్యాయమూర్తి హెచ్.ఆర్. ఖన్నా అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తి సభర్వాల్.. తన తనయులకు, ఆశ్రితులకు మేలు కలిగే విధంగా తీర్పు ఇచ్చారంటూ... ''మిడ్ డే'' పత్రికలో వెలువడిన కథనంపై ఢిల్లీ హైకోర్టు స్పందించిన తీరు మేధో సమాజం అంతా నిరసన వెలిబుచ్చడానికి దారితీసింది. తాము ప్రచురించినదంతా వాస్తవమేనని.. అందుకు ఆధారాలున్నాయని పత్రిక యాజమాన్యం చేసిన వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి కె.జి. బాలక్రిష్ణన్ ''తన కార్యాలయం సమాచార హక్కు చట్టపరిధిలోకి రాదు'' అని అభిప్రాయపడడం... మేధో సమాజాన్ని ఒకింత కలవరపెట్టింది.

ప్రపంచంలో ఎక్కడా కూడా న్యాయమూర్తులను న్యాయవ్యవస్థే నియమించడం లేదు. అది కార్యనిర్వాహక వర్గం బాధ్యత. ఆర్టికల్ 74 ప్రకారం రాష్ట్రపతి మంత్రిమండలి సలహామేరకు నియామకాలన్నీ జరుపుతారు. అయితే సుప్రీంకోర్టు... న్యాయవాదుల కేసు సందర్భంలో తీర్పునిస్తూ.. న్యాయమూర్తుల నియామకంలో భారత ప్రధాన న్యాయమూర్తి, మరి ఇతర సీనియర్ న్యాయమూర్తుల సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. దీంతో ప్రస్తుతం రాష్ట్రపతికి, మంత్రిమండలికి న్యాయమూర్తుల నియామకంలో తగిన పాత్ర లేదనే చెప్పాలి. ఈ పరిణామం కూడా న్యాయవ్యవస్థ క్రియాశీలతకు దోహదం చేసిందని చెప్పవచ్చు.

అన్ని రకాలైన నియంతృత్వాలలో న్యాయవ్యవస్థ నియంతృత్వం క్షమించరానిది. రాజ్యాంగాన్ని పరిరక్షించవలసిన వ్యవస్థే తన హద్దులను అతిక్రమిస్తే... కంచే చేను మేసినట్లు అవుతుంది. చట్టాలు రూపొందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులది. వాటిని అమలు చేసే విధి కార్యనిర్వహణ వర్గానిది. న్యాయవ్యవస్థ తన పరిధిని గుర్తించి, తదనుగుణంగా వ్యవహరిస్తేనే.. సగటు పౌరుని స్వేచ్ఛకు రక్షణ ఉంటుంది. అలాంటి వాతావరణాన్ని కల్పించడానికి పౌరసమాజం నడుం కట్టాలి!!

భారత న్యాయ వ్యవస్థ ప్రత్యేకత

భారత రాజ్యాంగ సంరక్షణ బాధ్యత న్యాయ వ్యవస్థదే. రాజ్యాంగ ఆధిక్యతను కాపాడుతూ, రాజ్యాంగాన్ని అధికారికంగా వ్యాఖ్యానిస్తున్న సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయ వ్యవస్థగా వెలుగొందుతోంది. సమాఖ్య లక్షణాలున్న మన దేశంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించే అధికారం సుప్రీంకోర్టుకు ఉంది. అదేవిధంగా హైకోర్టు నుంచి వచ్చే అన్నిరకాల అప్పీళ్లను విచారిస్తుంది. పౌరుల రక్షణకు అవసరమైన రిట్లను జారీచేస్తుంది. 'దేశ ఔన్నత్యం ఆ దేశ న్యాయవ్యవస్థ పని తీరులో ప్రతిబింబిస్తుందని' లార్డ్ బ్రైస్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో భారత న్యాయవ్యవస్థ తన న్యాయ సమీక్షాధికారాన్ని సమర్థంగా వినియోగిస్తోంది. చట్టం ద్వారా హక్కులను రక్షిస్తూ, అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేస్తోంది. సామాజిక హక్కులను రక్షిస్తూ, సామాన్య ప్రజలకు న్యాయం అందుబాటులో తేవడానికి అమెరికాలో ఉద్భవించిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు ఆస్ట్రేలియాలో మరింత ప్రజామోదం పొందాయి. ఇవి జస్టిస్ పీఎన్ భగవతి, జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్‌ల హయాంలో విస్తృతంగా ఆచరణలోకి వచ్చాయి.

1. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎన్నేళ్ల వయసులో పదవీ విరమణ చేస్తారు?

(గ్రూప్-2బి, 1987)

ఎ) 65 బి) 62 సి) 60 డి) 58

సమాధానం: ఎ

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు 65 ఏళ్లు. దీన్ని 67 ఏళ్లకు పెంచాలని రాజ్యాంగ పునఃసమీక్షా కమిషన్, లా కమిషన్లు సూచించాయి. న్యాయమూర్తుల పదవీ విరమణ వయసులో మార్పులు చేసే అధికారం పార్లమెంట్‌కు ఉంది.

2. న్యాయ సమీక్ష సూచన(అవకాశం) కల్పించే ఆర్టికల్?

(గ్రూప్-2బి, 1993)

ఎ) 12 బి) 13 సి) 14 డి) 15

సమాధానం: బి

మన దేశంలో శాసన వ్యవస్థ రూపొందించే చట్టాలు, ప్రభుత్వాల పాలనా చర్యలు రాజ్యాంగ బద్ధతను సమీక్షించే అధికారం న్యాయవ్యవస్థకు ఉంది. దీన్నే న్యాయ సమీక్షాధికారం అంటారు. ఈ పద్ధతిని అమెరికా నుంచి స్ఫూర్తిగా పొందినప్పటికీ రాజ్యాంగంలో ఈ పదాన్ని చేర్చలేదు. 13వ అధికరణం ప్రకారం రాజ్యాంగం అమల్లోకి వచ్చే నాటికి చట్టాలు మొత్తం లేదా భాగాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్నా.. పార్లమెంట్ రూపొందించే శాసనాలు ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్నా వాటిని చెల్లదని ప్రకటించే అధికారం సుప్రీంకోర్టుకు ఉంది.

3. ఏ కేసు సందర్భంలో న్యాయసమీక్ష భారత రాజ్యాంగ మౌలికాంశంగా సుప్రీంకోర్టు పేర్కొంది?(గ్రూప్-2, 2000)

ఎ) మినర్వామిల్స్-యూనియన్ ఆఫ్ ఇండియా

బి) బాలాజీ -ది స్టేట్ ఆఫ్ మైసూర్

సి) గోలక్‌నాథ్-ది స్టేట్ ఆఫ్ పంజాబ్

డి) కేశవానంద భారతి-ది స్టేట్ ఆఫ్ కేరళ

సమాధానం: ఎ

న్యాయ సమీక్షాధికారం రాజ్యాంగ మౌలికాంశంలో భాగమని మినర్వా మిల్స్‌కు విరుద్ధంగా యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. 1976లో ఇందిరాగాంధీ కాలంలో రూపొందించిన 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 368 అధికరణలో నాలుగో క్లాజును చేర్చింది. దీని ప్రకారం ఆదేశ సూత్రాల అమలుకు పార్లమెంట్ చేసే రాజ్యాంగ సవరణలు కోర్టు ముందు ప్రశ్నించరాదు.

4. మేనకాగాంధీ కేసులో సుప్రీంకోర్టు తీర్పు దేనికి సంబంధించింది?

(గ్రూప్-2, 2000)

ఎ) విదేశాల్లో పర్యటించే స్వేచ్ఛ

బి) జంతువుల పట్ల క్రూరత్వ నివారణ

సి) పరిసరాల సంరక్షణ

డి) స్త్రీ హక్కులు

సమాధానం: ఎ

1978లో మేనకాగాంధీ- యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య వివాదానికి సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పు ఇచ్చింది. గతంలో ఏకే గోపాలన్ కేసులో ఇచ్చిన తీర్పును సమీక్షిస్తూ ప్రాథమిక హక్కుల పరిధిని విస్తరించింది. మేనకాగాంధీ పాస్‌పోర్ట్‌ను ఢిల్లీ పోలీస్ కమిషనర్ స్వాధీనం చేసుకోవడాన్ని నిరసనగా వేసిన పిటిషన్ ఆధారంగా తీర్పునిస్తూ.. విదేశాల్లో పర్యటించడం కూడా ప్రాథమిక హక్కుల పరిధిలోనిదేనని పేర్కొంది.

5. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు కావాల్సిన అర్హతలు?

(గ్రూప్-2, 2009)

ఎ) హైకోర్టులో ఐదేళ్ల న్యాయమూర్తిగా లేదా పదేళ్ల న్యాయవాదిగా అనుభవం

బి) హైకోర్టులో ఐదేళ్ల న్యాయవాదిగా అనుభవం

సి) సుప్రీంకోర్టులో పదేళ్ల న్యాయవాదిగా అనుభవం

డి) న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొంది ఉండాలి

సమాధానం: ఎ

సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా నియామకం కావడానికి హైకోర్టులో ఐదేళ్ల న్యాయమూర్తి అనుభవం లేదా సుప్రీంకోర్టు లేదా హైకోర్టుల్లో కనీసం పదేళ్ల న్యాయవాదిగా పనిచేసి ఉండాలి. అదేవిధంగా రాష్ట్రపతి దృష్టిలో మంచి న్యాయకోవిదుడై ఉండాలి.

6. బచన్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు?

(గ్రూప్-1, 1983-84)

ఎ) అతి అరుదైన కేసుల్లో మరణదండనను సమర్థిస్తుంది
బి) పదవీ విరమణ వయసును తగ్గించే ప్రభుత్వ ఉత్తర్వును సమర్థిస్తుంది
సి) మానభంగ పీడితులకు సహాయాన్ని అందిస్తుంది
డి) రాజ్యాంగాన్ని సమర్థిస్తుంది

సమాధానం: ఎ

1983లో బచన్‌సింగ్ వర్సెస్ పంజాబ్ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ఉరిశిక్ష(మరణ దండన)ను అతి అరుదైన కేసుల్లో మాత్రమే విధించాలని పేర్కొంది.

7. భారత సుప్రీంకోర్టు అధికార పరిధి దేనికి సంబంధించింది? **(గ్రూప్-2, 2007)**

ఎ) కేంద్రం-రాష్ట్రాలు, వివిధ రాష్ట్రాల మధ్య విభేదాలు పరిష్కరించడం
బి) అప్పీల్ చేసుకోవడానికి స్పెషల్ లీవ్ పిటిషన్ మంజూరు చేయడం
సి) పౌరుల ప్రాథమిక హక్కులకు సంబంధించిన విషయాలు
డి) రాజ్యాంగానికి సంబంధించిన అన్ని కేసుల విచారణ

సమాధానం: ఎ

భారత రాజ్యాంగంలోని 131 అధికరణ సుప్రీంకోర్టు ఒరిజినల్ లేదా ప్రారంభ అధికారాలను తెలుపుతోంది. అంటే సుప్రీంకోర్టు పరిధిలో మాత్రమే విచారించే కేసులు. కేంద్రం-రాష్ట్రాలు, వివిధ రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను సుప్రీంకోర్టు విచారించి తీర్పులిస్తుంది. వీటినే ప్రారంభ అధికారాలు అంటారు.

8. ఏ సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై మహాభియోగ తీర్మానం ప్రతిపాదించారు? **(గ్రూప్-1, 1994)**

ఎ) కె. రామస్వామి
బి) ఎన్. వెంకటాచలయ్య
సి) వి. రామస్వామి
డి) ఎవరూ కాదు

సమాధానం: సి

పంజాబ్-హర్యానా హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన తమిళనాడుకు చెందిన వి.రామస్వామిపై మహాభియోగ తీర్మానం ప్రతిపాదించారు. భారత దేశ చరిత్రలో ఒకే సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై ఇలాంటి తీర్మానం ప్రతిపాదించినప్పటికీ, పార్లమెంట్‌కు కాంగ్రెస్‌పార్టీ గైర్హాజరీ కావడంతో ఇది వీగిపోయింది.

9. సుప్రీంకోర్టుకు వచ్చిన కింది ప్రముఖ వ్యాజ్యాల్లో ఆస్థి హక్కుతో సంబంధం లేనిది? **(గ్రూప్-1, 2004)**

ఎ) ఏకే గోపాలన్ -కేరళ
బి) గోలక్‌నాథ్ కేసు
సి) కేశవానందభారతి కేసు
డి) మినర్వామిల్స్ కేసు

సమాధానం: ఎ

ఏకే గోపాలన్ కేసు మినహా మిగతావన్నీ ఆస్థితో సంబంధమున్నవే. పరీక్షలో ఏకే గోపాలన్ ఆప్షన్ తప్పుగా ప్రచురించారు. ఏకే గోపాలన్-మద్రాస్ రాష్ట్రంగా చదువుకోవాలి. ఈ కేసు ప్రాథమిక హక్కులకు సంబంధించింది.

10.ఏ కేసులో ఇప్పటి నుంచి చెల్లదనే సిద్ధాంతాన్ని సుప్రీంకోర్టు అనుసరించింది? **(సివిల్స్-2002)**

ఎ) చంపకందొరై రాజన్ - మద్రాస్ రాష్ట్రం
బి) గోలక్‌నాథ్ - పంజాబ్
సి) కేశవానంద భారతి - కేరళ
డి) కేహర్‌సింగ్ - కేంద్ర ప్రభుత్వం

సమాధానం: బి

1967లో గోలక్‌నాథ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ప్రాథమిక హక్కులు సవరించే పార్లమెంట్‌కు లేదని పేర్కొంది. గతంలో చేసిన సవరణలకు ఇది వర్తించదని తీర్పునిస్తూ.. ఇప్పటి నుంచి ఈ తీర్పు వర్తిస్తుంది అని పేర్కొంది.

భారత పార్లమెంట్

భారత పార్లమెంట్ సార్వభౌమాధికార సంస్థా?

మన రాజ్యాంగం ఏర్పాటు చేసిన సంస్థల్లో అతి ముఖ్యమైంది పార్లమెంట్. దేశ సర్వోన్నత శాసన సంస్థైన పార్లమెంట్ ఆర్థిక, రాజ్యాంగ, న్యాయ విధులు కూడా నిర్వహిస్తుంది. రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంట్‌కే ఉంది. అందువల్ల పార్లమెంట్‌ను సార్వభౌమాధికార సంస్థగా భావిస్తారు. కానీ మన దేశంలో అధికృత రాజ్యాంగానిదే. పార్లమెంట్ సమావేశాల నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించే అధికారులతో పాటు, పార్లమెంట్ నిబంధనలు, పార్లమెంటరీ పారిభాషిక పదాలపై పోటీ పరీక్షల్లో అనేక ప్రశ్నలు వస్తున్నాయి. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టే వివిధ రకాల బిల్లులు, వాటి ప్రత్యేకతలు; కొన్ని బిల్లులు, తీర్మానాలపై లోక్‌సభకున్న ప్రత్యేక అధికారాలు కూడా గమనించాలి.

1. పరిపాలనపై వేటి ద్వారా పార్లమెంట్ నియంత్రణ కొనసాగిస్తోంది? (సివిల్స్-2001)

ఎ. పార్లమెంటరీ కమిటీలు

బి. మంత్రివర్గాల్లోని ఉప సంఘాలు

సి. పాలనాధికారులను నివేదికలు పంపమనడం

డి. కార్యనిర్వాహణాధికారులకు రిట్‌లు జారీ చేయమడం

సమాధానం: ఎ

'ఆధునిక కాలంలో పార్లమెంటరీ కమిటీలు శాసన వ్యవస్థకు కళ్లు, చెవులు, చేతులుగా కొన్ని సార్లు మెదడుగా పనిచేస్తున్నాయని' రీడ్ పేర్కొన్నారు. 1993లో ఏర్పడిన డిపార్ట్‌మెంటల్ రిలేటెడ్, ఆర్థిక, సంయుక్త పార్లమెంటరీ కమిటీల ద్వారా పరిపాలనపై నియంత్రణ కొనసాగిస్తోంది.

2. కింది వాటిలో దేనికోసం పార్లమెంట్ తీర్మానంతో పాటు 1/2 వంతు రాష్ట్రాల ఆమోదం కావాలి? (సివిల్స్-2000)

1) రాష్ట్రపతి ఎన్నిక

2) పార్లమెంట్‌లో రాష్ట్రాల ప్రాతినిధ్యం

3) రెండో షెడ్యూల్‌కు సంబంధించిన సవరణ

4) విధాన మండలిని రద్దు చేయడానికి

ఎ. 1, 2, 3 బి. 1, 3, 4

సి. 3, 2, 4 డి. 2, 3, 4

సమాధానం: ఎ

భారత రాజ్యాంగంలోని సమాఖ్య లక్షణాలు, సమాఖ్యపై ప్రభావం చూపే అంశాలు సవరించాలంటే పార్లమెంట్ ప్రత్యేక మెజార్టీతో తీర్మానం ఆమోదించడంతోపాటు 1/2 వంతు రాష్ట్రాల ఆమోదం పొందాలి.

3. స్పీకర్ కార్యాలయానికి సంబంధించి సరైంది? (సివిల్స్ - 1993)

ఎ. రాష్ట్రపతి అభీష్టం మేరకు పదవి నిర్వహిస్తారు

బి. స్పీకర్ ఎన్నిక సమయానికి సభ్యుడు కాకపోయినా 6 నెలల లోగా సభ్యుడు కావాలి.

సి. సాధారణ కాలపరిమితి కంటే ముందు లోక్‌సభ రద్దైతే పదవి కోల్పోతాడు

డి. స్పీకర్ రాజీనామాను డిప్యూటీ స్పీకర్‌కు సమర్పిస్తారు.

సమాధానం: డి

స్పీకర్‌ను లోక్‌సభ సభ్యులు ఎన్నుకొంటారు. సభలోని సభ్యున్ని మాత్రమే స్పీకర్‌గా ఎన్నుకుంటారు. లోక్‌సభ రద్దయినప్పటికీ స్పీకర్ పదవి వెంటనే రద్దుకాదు. కొత్త లోక్‌సభ మొదటి సమావేశం జరగడానికి ముందు వరకు పదవిలో కొనసాగుతారు.

4. పార్లమెంట్ చర్చాకాలంలో గిలెటిన్ ఏ సందర్భాల్లో ఉపయోగిస్తారు? (ఎపిఆర్‌ఓస్-2008)

ఎ. సమయాభావం వల్ల చర్చించలేనప్పుడు

బి. చర్చించి, ఆమోదించినప్పుడు

సి. చర్చించి, ఆమోదించలేప్పుడు

డి. చర్చించి, కుదించినప్పుడు

సమాధానం: ఎ

పార్లమెంట్ సమావేశాలు ముగింపు దశకు వచ్చిన సందర్భంలో బిల్లులను సమగ్రంగా చర్చించి, ఆమోదించడానికి తగిన సమయం ఉండదు. ఈ సమయంలో ఎలాంటి చర్చలేకుండానే బిల్లులను ఆమోదించడాన్ని గిలెటిన్ అంటారు.

5. భారత పార్లమెంట్ ఒక..

ఎ. సార్వభౌమత్వం ఉన్న అంగం

బి. సార్వభౌమత్వం లేని అంగం

సి. పాక్షిక సార్వభౌమత్వం ఉన్న అంగం

డి. సర్వోన్నత అంగం

సమాధానం: బి

భారత పార్లమెంట్ సార్వభౌమత్వం లేని అంగం. దేశంలో సర్వోన్నతమైంది రాజ్యాంగం. దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలన్నీ రాజ్యాంగ పరిధికి లోబడి పనిచేయాలి. రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉన్నప్పటికీ.. సవరించిన రాజ్యాంగానికి పార్లమెంట్ కట్టుబడాలి. అంతేకాకుండా భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంట్‌కు లేదని కేశవానంద భారతి కేసు మొదలుకొని అనేక కేసుల్లో సుప్రీంకోర్ట్ తీర్పు ఇచ్చింది.

6. వీటిలో అంచనాల సంఘం ఏ పార్లమెంటరీ స్థాయీ సంఘాల కిందకు వస్తుంది? (గ్రూప్-1, 2008)

ఎ. పరిశీలనా బి. ఆర్థిక వ్యవహారాల

సి. సభావ్యవహారాల డి. విచారణ

సమాధానం: బి

పార్లమెంట్ నుంచి ఏర్పడిన సంఘాల్లో ఆర్థిక సంఘాలు ప్రధా

న్యం ఉన్నవిగా పేర్కోవచ్చు. పబ్లిక్ అకౌంట్స్, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ, అంచనాల సంఘం వంటివి ఆర్థిక వ్యవహారాల కమిటీలు.

7. వీటిలో ద్రవ్య బిల్లు ప్రధాన లక్షణం కానిది? **(గ్రూప్-1, 2008)**

ఎ. దిగువ సభలో మాత్రమే ప్రవేశపెట్టలి
బి. ఎగువసభ సవరించడం లేదా వ్యతిరేకించడం చేయరాదు
సి. రాష్ట్రపతి సిఫార్సుతోనే ప్రవేశపెట్టాలి
డి. రాష్ట్రపతి తిరస్కరణ లేదా ఆమోదం తెలపొచ్చు లేదా పునఃపరిశీలనకు పంపొచ్చు

సమాధానం: బి

ద్రవ్య బిల్లును రాష్ట్రపతి అనుమతితో లోక్‌సభలో ప్రవేశపెట్టాలి. రాజ్యసభ సవరించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. అయితే లోక్‌సభ, రాజ్యసభ సవరణలను ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. యధావిధిగా రెండోసారి ఆమోదిస్తే రాజ్య సభ ఆమోదం లేకుండానే రాష్ట్రపతి ఆమోదానికి పంపొచ్చు. ఆర్థిక బిల్లులు తిరస్కరించడం లేదా పునఃపరిశీలనకు పంపే అధికారం రాష్ట్రపతికి లేదు.

8. లోక్‌సభలో ప్రథమంగా ప్రతిపక్ష నాయకుడి హోదా పొందిన వ్యక్తి కింది వారిలో ఎవరు?

ఎ. ఎ.కె. గోపాలన్ బి. వై.బి చవాన్
సి. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ డి. ఇందిరా గాంధీ

సమాధానం: బి

లోక్‌సభ మొత్తం సభ్యుల సంఖ్యలో 1/10 వంతు స్థానాలను పొందిన పార్టీ నాయకుడికి ప్రతిపక్ష నేత హోదా కల్పిస్తారు. 1977లో జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన సందర్భంలో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా అవతరించినప్పటికీ ఇందిరాగాంధీ లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోవడంతో వైబి చవాన్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి కేంద్ర కేబినెట్ హోదాను కల్పిస్తారు.

9. శాసన నిర్మాణ ప్రక్రియ జరపడానికి రెండు సభలు సమావేశమైనప్పుడు దానికి అధ్యక్షత వహించేది? **(గ్రూప్-1, 1999)**

ఎ. రాష్ట్రపతి బి. ఉపరాష్ట్రపతి
సి. లోక్‌సభ అధ్యక్షులు
డి. పార్లమెంట్‌లోని సీనియర్ మోస్ట్ సభ్యులు

సమాధానం: సి

పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశం 108 అధికరణ అనుసరించి రాష్ట్రపతి ఏర్పాటు చేసినప్పటికీ లోక్‌సభ స్పీకర్ అధ్యక్షత వహిస్తారు. ఉభయ సభలు శాసనం రూపొందించడానికి మొదటి సంయుక్త సమావేశం - 1961లో వరకట్న నిషేధ బిల్లు విషయంలో జరిగింది.

10. రాజ్యసభకు సంబంధించి వాస్తవం కాని అంశం?

ఎ. శాశ్వతసభ బి. ద్వైవార్షిక ఎన్నికలు
సి. పదవీకాలం ఆరేళ్లు డి. నిరంతర సభ

సమాధానం: సి

రాజ్యసభ రద్దుకు అవకాశం లేదు. ప్రతి రెండు సంవత్సరాలకు 1/3వంతు స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. మొత్తం స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరగవు. ఒకేసారి రద్దు కాదు. అందువల్ల దీన్ని నిరంతర సభ అంటారు. సభ్యుల పదవీకాలం ఆరేళ్లు. సభ పదవీ కాలం ఆరేళ్లు కాదు.

11. లోక్‌సభకు ఎన్నికైన సభ్యులసంఖ్య? **(గ్రూప్-2, పీఎస్ 2003)**

ఎ. 182 బి. 250 సి. 543 డి. 490

సమాధానం: సి

లోక్‌సభ గరిష్ట సభ్యుల సంఖ్య 550+2 అయినప్పటికీ ప్రస్తుతం 543 ఎన్నుకున్న సభ్యులతో పాటు రాష్ట్రపతి నియమించిన ఇద్దరు ఆంగ్లో ఇండియన్‌లు ఉంటారు. 1971 జనాభా లెక్కలు ఆధారం చేసుకొని 1973లో నిర్ణయించిన ఈ సంఖ్యలో 2026 వరకు మార్పులు చేయరాదని 84వ రాజ్యాంగ సవరణలో పేర్కొన్నారు.

12. భారత పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌ను ఎవరు నియమిస్తారు? **(గ్రూప్-2, ఎఎస్ 2003)**

ఎ. ప్రధానమంత్రి బి. రాష్ట్రపతి
సి. లోక్‌సభ స్పీకర్ డి. రాజ్యసభ చైర్మన్

సమాధానం: సి

పార్లమెంట్ ద్వారా ఏర్పడే సంయుక్త కమిటీల్లో ముఖ్యమైన ఆర్థిక కమిటీ పీఏసీ చైర్మన్‌ను లోక్‌సభ స్పీకర్ నియమిస్తారు. కమిటీ తన నివేదికను స్పీకర్‌కు సమర్పిస్తుంది.

13. రాజ్యసభ చైర్మన్ పదవిలోకి ఎలా వస్తారు?

ఎ. రాజ్యసభ ఎన్నుకోవటం ద్వారా
బి. లోక్‌సభ ఎన్నుకోవటం ద్వారా
సి. ఉభయ సభలు ఎన్నుకోవటం ద్వారా
డి. రాష్ట్రపతి నియామకం ద్వారా

సమాధానం: సి

రాజ్యసభకు ఉపరాష్ట్రపతి చైర్మన్‌గా అధ్యక్షత వహిస్తారు. ఉపరాష్ట్రపతిని పార్లమెంట్‌లోని ఉభయ సభల సభ్యులు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిపై ఎన్నుకుంటారు.

లోక్‌పాల్/లోకాయుక్త వ్యవస్థ

"ఎంత దాచి పెట్టడానికి ప్రయత్నించినా... అవినీతి ఎప్పుడో ఒకప్పుడు బయటపడుతుంది. ప్రభుత్వ ఉద్యోగులను జవాబుదారీగా చేయాల్సిన హక్కు, బాధ్యత ప్రజలపై ఉంది. అవినీతిపరులైన ఉద్యోగులను న్యాయస్థానాల కీడ్చడం లేదా వారిపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించడానికి ఒక నిర్ణేతను నియమించాలి."

- మహాత్మా గాంధీ (1928)

రాజకీయ, పాలనా వ్యవస్థలో పేరుకుపోతున్న బాధ్యతారాహిత ధోరణిని, అవినీతిని నియంత్రించాలంటే... లోక్‌పాల్ వ్యవస్థ ఎంతో అవసరం. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఆధునిక కార్యనిర్వాహక వర్గాన్ని నియంత్రించే స్థితిలో లేదు. పౌరజీవనం మరింత సంక్లిష్టం కావడం వల్ల ప్రతిచిన్న విషయానికి సగటు పౌరుడు ప్రభుత్వంపై ఆధారపడవలసి వస్తుంది. ఆలోచితంగా, అనాలోచితంగా ప్రభుత్వాధికారం విస్తరిస్తుంది. సహజంగా ఇది అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది. పౌర చైతన్యం అంతంత మాత్రంగానే ఉన్న భారత్ లాంటి వర్ధమాన దేశంలో... పాలనా యంత్రాంగం దుర్వినియోగానికి అంతు లేదు. దీనిని అరికట్టడానికి ఉద్దేశించిందే లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థ.

ఆంబుడ్స్‌మన్:

ఆధునిక కాలంలో మొదటిసారిగా స్వీడన్ దేశంలో 1809లో ఆంబుడ్స్‌మన్ వ్యవస్థ ఏర్పాటయింది. పార్లమెంటు ప్రతినిధిగా ఈ బహుళ సభ్య వ్యవస్థ పౌరుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి.. సంబంధిత పాలనాధికారులను సంప్రదించి, దానికి పరిష్కార మార్గాన్ని కనుగొంటుంది. ఇతర స్కాండినేవియా దేశాలైన నార్వే, ఫిన్లాండ్, డెన్మార్క్‌లలో ఈ వ్యవస్థ ఏర్పాటయింది. దీని చురుకైన పాత్ర వల్లే ఆ దేశాలలో అవినీతి చాలా తక్కువ. వరుసగా గత మూడు సంవత్సరాలు ఫిన్లాండ్ అవినీతి రహితమైన దేశంగా గుర్తింపు పొందడానికి కారణమిదే. ఇంగ్లాండులో ''పార్లమెంటరీ కమిషనర్''.. ఫ్రాన్సులో 'కౌన్సిల్ డి ఎటాట్' ఈ కోవకు చెందినవే.

భారతదేశం విషయానికొస్తే... 1964లో కె.సంతానం కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర నిఘా సంస్థ (Central Vigilence Commission) ఏర్పాటైంది. దీనికి నేర విచారణలో సహాయపడటానికి సీబీఐ ఏర్పాటయింది. కానీ ఈ నిఘా సంస్థ పరిధి, ప్రభుత్వోద్యోగుల అవినీతి కార్యకలాపాల విచారణకు మాత్రమే పరిమితం. పైగా సీబీఐ లాంటి వ్యవస్థలు రాజకీయ ఒత్తిళ్లకు లోనై ప్రభావవంతంగా పనిచేయలేకపోతున్నాయి. దీంతో సామాన్య ప్రజానీకానికి పాలనా వ్యవస్థ మీద విశ్వాసం సన్నగిల్లుతోంది. 1948లో గాంధీ మహాత్ముడు ప్రార్థనా సమావేశంలో వెలిబుచ్చిన ఆవేదన ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతోంది. ''నేడు రాజకీయాలు అవినీతిమయమయ్యాయి. రాజకీయాల్లో ప్రవేశించే ప్రతి వ్యక్తి కలుషితమవుతున్నాడు''.

మొదటి పాలనా సంస్కరణల సంఘం 1967లో లోక్‌పాల్/లోకాయుక్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. కానీ ఒకవైపు రాజకీయ నాయకులు, మరోవైపు ప్రభుత్వోద్యోగులు ఈ చొరవను పరోక్షంగా ప్రతిఘటిస్తూ వచ్చారు. ఏదో ఒక కుంటిసాకుతో ఇప్పటివరకు లోక్‌పాల్ వ్యవస్థ వెలుగు చూడలేదు. ఇప్పటికీ ఎనిమిదిసార్లు(1968, 1971, 1977, 1985, 1989, 1996, 1998, 2001) పార్లమెంటులో దీనికి సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టడం జరిగింది. త్వరలో జరగబోయే వర్షాకాల సమావేశాల్లో (2008) సమగ్రమైన బిల్లును ప్రవేశపెట్టాలని మంత్రి మండలి నిర్ణయించింది. ఇటీవల సంభవించిన రాజకీయ పరిణామాల దృష్ట్యా ఆ బిల్లు ప్రవేశపెట్టినా ఆమోదం పొందటం అనుమానమే.

లోక్‌పాల్ వ్యవస్థ:

ప్రజలకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో న్యాయాన్ని అందించడం లోక్‌పాల్ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. శాసన, కార్యనిర్వాహక న్యాయశాఖలతోపాటు మంత్రిమండలి, పార్లమెంటు సభ్యులు, న్యాయవ్యవస్థ దీని పరిధిలోకి వస్తాయి. అయితే, ఇటీవల మంత్రిమండలి తీసుకున్న నిర్ణయం మేరకు ప్రధానమంత్రిని దీని పరిధి నుంచి తొలగించారు. ఇది వివాదాస్పద నిర్ణయమే. ''చట్టం ముందు అందరూ సమానులే'' అనే మూల సూత్రానికి చిల్లులు పెట్టడమే. 10 సంవత్సరాలలోపు జరిగిన నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు మాత్రమే స్వీకరిస్తారు. ఫిర్యాదు అందిన ఆరు నెలల్లో విచారణ జరపాలి. సివిల్ కోర్టు అధికారాలు కలిగి, సమన్లు జారీ చేయవచ్చు. అయితే, ఇది తనంతట తాను చర్యలు తీసుకోలేదు. సిఫార్సులు చేస్తుంది. వాటిపై చర్య తీసుకోవడం సంబంధిత శాఖ బాధ్యత. వార్షిక ప్రాతిపదికన రాష్ట్రపతికి నివేదిక సమర్పిస్తుంది. దీని స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడటానికి కింది నిబంధనలు ప్రతిపాదించారు.

ఎ) భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షుడిగా.. మరో ఇద్దరు మాజీ న్యాయమూర్తులు సభ్యులుగా ఉండే బహు సభ్య సంఘం.

బి) ఉపరాష్ట్రపతి అధ్యక్షతన రాష్ట్రపతి ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సుల మేరకు నియమిస్తారు. ఈ కమిటీలో ప్రధానమంత్రి, అంతరంగిక వ్యవహారాల మంత్రి, లోక్‌సభ స్పీకర్, ఉభయ సభల్లో ప్రతిపక్ష నాయకులు సభ్యులు.

సి) మూడు సంవత్సరాల పదవీ కాలానికి నియమితులై, పదవీ విరమణ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఎలాంటి ఆదాయాన్నిచ్చే పదవికి అర్హులు కారు.

డి) వీరిపై వచ్చిన అభియోగాలను భారత ప్రధాన న్యాయమూర్తి, మరో ఇద్దరు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు విచారిస్తారు.

ఇ) పౌరులు చేసిన ఫిర్యాదులను విచారించడానికి ప్రత్యేక పాలనా యంత్రాంగం ఏర్పాటవుతుంది.

లోక్‌పాల్ వ్యవస్థ పరిధిని, అవినీతి ఆరోపణలను పరిశీలించడానికి మాత్రమే పరిమితం చేయడం.. దుష్పరిపాలనకు (Maladministration) సంబంధించిన ఫిర్యాదులు దీని పరిధి నుంచి తప్పించడం.. ఆశించదగ్గ పరిణామం కాదు. అలాంటప్పుడు దీనికి, కేంద్ర నిఘా సంస్థకు పెద్ద తేడా లేదు.

రాష్ట్రాల్లో క్లేశ నివారణ యంత్రాంగం:

ఆంధ్రప్రదేశ్‌తో సహా 17 రాష్ట్రాల్లో లోకాయుక్త వ్యవస్థ ఏర్పాటైంది. ఈ వ్యవస్థ ఏర్పాటుకు చొరవ తీసుకొన్న మొదటి రాష్ట్రం ఒరిస్సా (1971). ఆంధ్రప్రదేశ్‌లో 1983లో ఏర్పాటైంది. మన రాష్ట్రంలో లోకాయుక్తతో పాటు, ఉప లోకాయుక్త వ్యవస్థ కూడా ఉంది. రాష్ట్ర హైకోర్టు, జిల్లా కోర్టు న్యాయమూర్తులు ఈ పదవులకు ఎంపికవుతారు. కర్ణాటక, కేరళ లాంటి రాష్ట్రాలు మినహా మిగతా రాష్ట్రాలలో ఈ వ్యవస్థ అంత ప్రభావితంగా పని చేయడం లేదు. అందుకు కారణం... చాలీచాలని వనరులు; రాజకీయ, ఉద్యోగి స్వామ్య సహాయ నిరాకరణ వైఖరి; బలహీనమైన పౌర సమాజం; పరిమితమైన అధికారాలు; పౌరుల్లో చైతన్యం లోపించడం మొదలైనవి.

ముగింపు:

10 వేల సంవత్సరాల సంపన్న వారసత్వం కలిగిన మన దేశంలో... వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు.. నీతి, నిజాయితీ, స్వచ్ఛతను ప్రోత్సహించాయి. దురదృష్టవశాత్తు ఇటీవల కాలంలో సామాజిక విలువలు పతనమవుతూ, పాలనా వ్యవస్థ అవినీతిలో కూరుకుపోతోంది. దీనివల్ల సగటు పౌరుడికి నష్టం కలుగుతుంది. అత్యంత అవినీతికరమైన 20 దేశాల్లో భారతదేశం ఒకటి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో అవినీతి, బాధ్యతారహిత ధోరణి తారాస్థాయికి చేరుకుందంటే.. ప్రజల్లో క్రమేణా ప్రజాస్వామ్య వ్యవస్థ మీద ఏవగింపు కలిగినా ఆశ్చర్య పడనవసరం లేదు. దీనికి విరుగుడు ఆంబడ్స్‌మన్ వ్యవస్థను బలోపేతం చేయడమే. లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థలకు రాజ్యాంగ పరమైన హోదాను కల్పిస్తూ.. ప్రభుత్వంలోని అన్ని విభాగాలను వీటి పరిధిలోకి తెచ్చి (సైన్యంతో సహా), నిష్కళంకులైన వారికి ఈ బాధ్యతలను అప్పచెప్పడంతో పాటు, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన విచారణ వ్యవస్థను ఏర్పాటు చేసి.. సమాచార హక్కును పౌరులు సద్వినియోగ పర్చుకోవడానికి అవకాశం కల్గించినప్పుడే ప్రజలకు సుపరిపాలన అందించడానికి వీలవుతుంది!!